# 3

# యేసు, దేవదూతలు, మరియు మనము

## (1:4-14)

మనం హెబ్రీయులకు 1:4ను ఇదివరకే ధ్యానం చేశాము "దేవదూతల కంటే యేసు శ్రేష్ఠుడు" అని ఇది తెలియజేస్తుంది. ఈ అధ్యాయం లోని మిగతా భాగం దూతలు మరియు యేసును పోల్చి చెబుతూ, మనకు ఒక సందేశమును ఇది యిస్తుంది.

### దేవదూతలు

దేవదూతలు అంటే ఎవరు, వారు ఏంచేస్తుంటారు వంటి ప్రశ్నలతో దేవదూతల గురించిన ఆసక్తి మనుష్యులలో ఉంది: హెబ్రీ పత్రిక దూతల గురించి ఎన్నో సార్లు చెప్తుంది. మన వాక్య భాగం గాకుండా దూతలను గురించిన ప్రస్తావన 2వ అధ్యాయంలోనూ కనబడుతుంది (2, 5, 7, 9, 16 వచనాలు). పత్రిక చివరి భాగంలో కూడ రెండుసార్లు దూతల ప్రస్తావన ఉంది (12:22; 13:2).

దేవదూతల గురించి వాక్యం చెప్పే మరింత ఆసక్తికర విషయం 1:14లో కనబడుతుంది: "వీరందరు రక్షణయను స్వాస్థ్యము పొందబోవువారికి పరిచారము చేయుటకై పంపబడిన సేవకులైన ఆత్మలు కారా?" దేవదూతలు క్రైస్తవులకు ఎలా సహాయం చేస్తారు అంటే, అది మనకు చెప్పబడలేదు. తమ పిల్లల విషయంలో దేవుడు తీసుకునే శ్రద్ధలో వారు నిమగ్నమైయున్నారు.

### యేసు మరియు దూతలు

దేవదూతలను గురించిన అంశం ఆసక్తికరముగా ఉన్నప్పటికీ దూతలు యేసుతో పోల్చబడలేరు. ఇదే మన వాక్య భాగం యొక్క సారాంశము. క్రీస్తు దేవదూతలకంటె శ్రేష్ఠుడు అని చెప్పడానికి గ్రంథకర్త తీసుకున్న వాదన ఆధారం: ఆయన శ్రేష్ఠుడని *లేఖనాలు* యిలా చెప్తున్నాయి. 1:4-14లో ఏడు పాత నిబంధన వాక్య భాగములు ఉదహరించబడ్డాయి. ఇవి ప్రాథమికంగా కీర్తనల గ్రంథం నుండి తీసుకోబడ్డాయి. ఈ వాక్య భాగమంతటిలోనూ మనకు కనిపించే భావము ఏమంటే, యేసు దూతల కంటెను శ్రేష్ఠుడు, ఎందుకంటే దూతలు *సేవకులు* అయుండగా, ఆయన *కుమారుడు.* గ్రంథకర్త భావమును గమనించండి:

(1) యేసు దూతల కంటె శ్రేష్ఠుడు, ఎందుకంటే, *ఆయన దేవుని కుమారుడు అని పిలువబడ్డాడు. దేవ దూతలు పిలువబడలేదు* (4, 5 వచనాలు). కీర్తన 2:7 మరియు 2 సమూయేలు 7:14 పేర్కొనబడ్డాయి. ఇవి రెండు దావీదు వంశమునకు సంబంధించినవి. అవి రెండూ క్రీస్తులో సంపూర్ణంగా నెరవేర్చబడ్డాయి.

(2) యేసు దూతల కంటె శ్రేష్ఠుడు ఎందుకంటే, *దూతలు ఆయన్ను ఆరాధించాలి* (అథముడు ఘనుని ఆరాధిస్తాడు). 6వ వచనం సెప్టూజెంట్ (LXX)లోని ద్వితీయోపదేశకాండం 32:43నుండి ఉదహరించబడినది. కానీ గ్రంథకర్త ఈ వాక్యమును యేసునకు అన్వయించుటకు

వెనుకాడలేదు ఎందుకంటే, "ఆయన దేవుని తత్వము యొక్క మూర్తిమంతమునై" ఉన్నాడు (హెబ్రీయులకు 1:3).

(3) యేసు దూతలకంటే శ్రేష్ఠుడు ఎందుకంటే, *దూతలు ఎంత గొప్ప వారయినా, వారి గొప్పతనం కుమారుని గొప్పతనం ముందు సరిపోజాలదు. ఆయన అంతటా ఎల్లకాలము పరిపాలించువారు* (7–9 వచనాలు). 7వ వచనంలోని వాక్య LXXలోని కీర్తన 104:4లోనిది. కుమారుని గురించిన వాక్యము (8, 9 వచనాలు) "రాజరిక కీర్తన" (కీర్తన 45:6, 7) లోనిది. ఇది అంతిమంగా క్రీస్తులో సంపూర్ణంగా నెరవేరినది.

(4) యేసు దూతలకంటే శ్రేష్ఠుడు ఎందుకంటే, *ఆయన సమస్తమునకు నిత్య సృష్టికర్త* (10–12 వచనాలు); ఇందుకు భిన్నంగా దూతలు సృష్టికర్తలు కారు, సృజింపబడినవారు. ఇక్కడ కీర్తన 102:25–27ను వాక్యం ఉదహరిస్తుంది. ఇది దేవుని గురించి మాట్లాడుతుంది కానీ గ్రంథకర్త దీనిని క్రీస్తునకు అన్వయించాడు. ఆయన ద్వారా దేవుడు సమస్తమును సృజించాడు (హెబ్రీయులకు 1:2).

(5) యేసు దూతలకంటే శ్రేష్ఠుడు ఎందుకంటే, *యేసు పరిపాలన చేస్తుండగా దేవదూతలు సేవిస్తున్నారు* (13, 14 వచనాలు). యేసు సింహాసనాసీనుడైయున్నాడని చెప్పుటకు కీర్తన 110:1 ఉదహరించబడింది. ఇప్పుడు దూతలు సేవకులైయున్నారన్న సత్యం స్పష్టం చేయబడింది. (క్రీస్తు దూతలకంటే శ్రేష్ఠుడు అన్న చర్చ 2:1–4లోని హెచ్చరిక తరువాత 2:5లో కొనసాగించబడింది.)

## యేసు, దూతలు, మరియు మనం

యేసు దూతల కంటే శ్రేష్ఠుడు అన్న విషయాన్ని గ్రంథకర్త ఎందుకు తన మొదటి అంశంగా ఎంచుకున్నాడు? ఇది మనకు ఎలా సంబంధించి ఉంది? యేసు దూతల కంటే శ్రేష్ఠుడు అన్న అంశమునకు సంబంధించిన అన్వయింపును గ్రంథకర్త 2:1–4లో యిస్తున్నాడు (ప్రత్యేకంగా గమనించు 2 మరియు 3 వచనాలు), అయితే ప్రస్తుతం వరుసలో వెళ్ళుటకు కొన్ని అదనపు తలంపులు మీకియ్యబడుతున్నాయి.

దూతల యొక్క వంశ క్రమము, వారి విధానం ఎలా ఉంటుందోనన్న ఆసక్తి యూదులలో ఉండేది. కొంతమంది ఆది క్రైస్తవులు కూడ దూతలను గురించిన అంశం గురించి వారు విపరీతాసక్తితో ఉండేవారు. కొంతమంది, వారిని ఆరాధించినట్లు ఆధారాలు కూడ ఉన్నాయి (కొలొస్సయులకు 2:18; చూడు ప్రకటన 19:10; 22:8, 9). దూతల మీద యేసు యొక్క శ్రేష్ఠత్వాన్ని గురించి గ్రంథకర్త ఎందుకు మొదటిగా పేర్కొన్నాడు అన్నది 1వ వచనమునకు సంబంధించియున్నది: "పూర్వకాలమందు నానాసమయములలోను, నానావిధములుగాను ... మన పితరులతో మాట్లాడిన దేవుడు ..." ఆ విధములో ఒక విధము దూతల ద్వారా సందేశాన్ని అందించడం. తరువాత అధ్యాయంలోని 2వ వచనం పాత నిబంధన బయల్పాటును అందించిన దూతలకు సంబంధించినది. ఒకవేళ యేసు దూతలకంటే శ్రేష్ఠుడు అయితే, వారు బయల్పరచిన దానికంటే ఆయన బయల్పరచినదే శ్రేష్ఠము (1:2).

యేసు బయల్పరిచిన నూతన నిబంధన పాత నిబంధన కంటె శ్రేష్ఠము (హెబ్రీ పత్రిక ఉద్దేశం) అన్న సందేశం గాక మనకు వేరే సందేశం ఏదయినా ఇక్కడ ఉందా? ఈనాటికీ దూతలు అంటే ప్రజలకు ఆసక్తే! నిజానికి క్రొత్తగా, వింతగా ఉన్న, ఏదయిన, ప్రజలకు ఆసక్తి

కలిగిస్తుంది. మన వాక్యభాగంనుండి మనం నేర్చుకునేదేమంటే, ఏదీ కూడ మన నేత్రాలను యేసు నుండి దృష్టిమరల్చేదిగా ఉండకూడదు. మనం ఘనపరచవలసిన, ఆరాధించవలసిన, విధేయత చూపవలసిన వ్యక్తి *ఆయనే!* *ఆయనే* ప్రోత్సాహం, ఆదరణకు మూలము!